నాసిరకంగా సీసీ రోడ్డు పనులు

- రూ.40 లక్షల పనులపై పర్యవేక్షణ కరువు
- నల్లమట్టితో సైడ్‌బర్మ్‌లు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు




నాసిరకంగా నిర్మించిన సీసీ రోడ్లకు ఇరువైపులా మట్టితో నింపిన సైడ్‌బర్మ్‌లు

హన్మకొండ చౌరస్తా: అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని స్వయంగా మున్సిపల్ కమిషనర్, కలెక్టర్లు హెచ్చరిస్తున్నా కాంట్రాక్టర్లు మాత్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. లక్షల రూపాయల ప్రజాధనంతో చేపట్టిన అభివృద్ధి పనులు నాసిరకంగా చేస్తూ జేబులు నింపుకుంటున్నారనే విమర్శలున్నాయి. ప్రజలకు మెరుగైన వసతుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు చేయకుండా అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై అక్రమంగా దోచుకుతింటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లోపించిన నాణ్యత

హనుమకొండ 10వ డివిజన్ పరిధిలోని పద్మాక్షికాలనీలో మున్సిపల్ కార్పొరేషన్ నిధులు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత లోపించిందని స్థానికులు వాపోతున్నారు. సుమారు 20 సంవత్సరాల తర్వాత కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు నాసిరకంగా నిర్మించడంతో ఎక్కువ కాలం మన్నికగా ఉండదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాసిరకం మట్టితో సైడ్‌బర్మ్

పద్మాక్షి కాలనీలోని రెండు గల్లీల్లో నిర్మించిన సీసీ రోడ్డుకు ఇరువైపులా నల్లమట్టితో సైడ్‌బర్మ్‌లు పోయడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వస్తే మట్టి కుంగిపోయి బురదగా మారుతుందని చెబుతున్నారు. నాణ్యమైన మొరంతో సైడ్‌బర్మ్‌లను నింపాల్సిన కాంట్రాక్టర్.. రోడ్డు నిర్మాణంలో తవ్విన మట్టినే వాడారని ఆరోపిస్తున్నారు. అభివృద్ధి పనులను పర్యవేక్షించాల్సిన మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతోనే సదరు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులను పూర్తి చేశాడని ప్రజలు అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తా..



20 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సహకారంతో రూ.40 లక్షలు విడుదలయ్యాయి. నాణ్యతతో ఏళ్ల తరబడి ఉండాల్సిన సీసీ రోడ్డు పనులను అధ్వానంగా నిర్మించారు. పనులను పర్యవేక్షించాల్సిన మున్సిపల్ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. సదరు కాంట్రాక్టర్, అధికారులపై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తా.

– తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్, 10వ డివిజన్

వర్షాకాలంలో బురదమయంగా మారుతుంది



సీసీ రోడ్డుకు సైడ్‌బర్మ్‌లను నల్లమట్టితో పూర్తిచేశారు. ఆ మట్టి వర్షాకాలంలో కూరుకుపోయి బురదగా మారుతుంది. దాంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడనున్నారు. అధికారులు స్పందించి నాణ్యమైన మొరంతో సైడ్ బర్మ్‌లు పోయించాలి.

– శరత్, పద్మాక్షికాలనీ

'ఆహార నిబంధనలు' అమలు చేయాలి

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్: వరంగల్ జిల్లాలో ఆహార భద్రత నిబంధనలకు పకడ్బందీగా అమలు చేయాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఫుడ్‌సేఫ్టీ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా, జిల్లా స్థాయి అడ్వైయిజరీ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆహార ఉత్పత్తులపై పరీక్షలు నిర్వహించాలని, వ్యాపారాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. నిబంధనలకు లోబడి ఆహార భద్రత ప్రమాణాలను పాటించాలని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు, డీఎస్‌డీఓ కిష్టయ్య, జిల్లా పరిశ్రమల అధికారి సాల్మన్‌రాజు, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలి



మహాసభలో అభివాదం చేస్తున్న నాయకులు

వరంగల్: పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోని కార్మికులకు కనీస వేతనాలు అందిస్తూ ఈఎస్ఐ, పీఎఫ్‌ను వర్తింపజేయాలని సంఘం కేంద్ర కమిటీ సభ్యుడు నైనాలశెట్టి మూర్తి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీటీయూ మొదటి మహాసభ ఫిబ్రవరి 9, 10వ తేదీల్లో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌లో హాల్ జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మూడోసారి అధికారంలో వచ్చిన మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను ఏర్పాటు చేసి కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చిందని విమర్శించారు. మహాసభలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. అనంతరం ఏఐసీసీటీయూ రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశాల్లో ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి వి.శంకర్, రాష్ట్ర నాయకులు రమేష్‌రాజా, అక్కెనపల్లి యాదగిరి, గుమ్మడి రాజుల సాంబయ్య, ఖాజా మొహినొద్దీన్, రాష్ట్ర ఇన్‌చార్జ్ రొయ్యల రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 11న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ ఇన్‌చార్జ్ డీఈ బి.సామ్యా నాయక్ తెలిపారు. ప్రకాశ్‌రెడ్డిపేట, పోస్టల్ కాలనీ, పోలీసు కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, విద్యుత్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. రథం, పెట్రోల్ పంపు, బండిశెట్టి, నిజాంపుర, మండిబజార్, గోవిందరాజుల గుట్ట, లక్ష్మీపూర్, గిర్మాజీపేట ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు సాధన సజ్జన సాంగత్యం

నయీంనగర్: వాయుపుత్ర మెడిటేషన్ సెంటర్ కాపువాడలో బుధవారం సాధన సజ్జన సాంగత్యం ఏర్పాటు చేయనున్నట్లు పీఎస్ఎస్ఎం ప్రెసిడెంట్ ఆనంద్ దాలియా తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యోగి కట్ట కళాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమాన్ని ప్రజలు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో రామమూర్తి, రవీందర్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా పే చర్చ ప్రత్యక్ష ప్రసారం



కాజీపేట అర్బన్: కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షా పే చర్చ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ పాఠశాల విద్యార్థులు సోమవారం వీక్షించారు. పరీక్షల సమయంలో సమయం, ఒత్తిడిని అధిగమించడం, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం, సబ్జెక్ట్‌పై పట్టు సాధించడం వంటి పలు విషయాలను నరేంద్రమోదీ సూచించారు.

కార్పొరేటర్‌కు పరామర్శ

కాజీపేట: హనుమకొండ గార్డియన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగ్ రావును బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు సోమవారం పరామర్శించారు. ఇటీవల కాజీపేట పట్టణంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడడంతో నర్సింగ్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించగా వైద్యులు శస్త్రచికిత్స చేశారు.

అరూరి రమేష్‌కు పరామర్శ



హన్మకొండ: బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను మాజీ ఎంపీలు గరికపాటి మోహన్‌రావు, చాడా సురేష్‌రెడ్డి, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సోమవారం పరామర్శించారు. అరూరి రమేష్ తల్లి అరూరి వెంకటమ్మ ఇటీవల మృతి చెందగా, జఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్లులోని స్వగృహంలో వెంకటమ్మ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి సోమవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ గ్రూప్స్ చైర్మన్ సంపత్ రావు, వరంగల్ రెడ్ క్రాస్ మాజీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకుడు సారంగపాణి పాల్గొన్నారు.

మధురానగర్‌లో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి

వరంగల్: నగరంలోని 14వ డివిజన్ మధురానగర్‌లోని ఆరు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు హనుమకొండలోని క్యాంపు కార్యాలయంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. విలీన గ్రామ పరిధిలో ఉన్న మధురానగర్.. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అలువాల సదాశివుడు, ప్రధాన కార్యదర్శి గూడూరు ఎల్లయ్య, వ్యవస్థాపక అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓయో లాడ్జ్‌కు అనుమతి ఇవ్వొద్దు

ఖిలా వరంగల్: జనావాసాల్లో ఓయో లాడ్జ్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దని గణేష్‌నగర్ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి మదూరి సోమయ్యగౌడ్ కోరారు. ఈమేరకు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును కాలనీ ప్రతినిధులతో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ వరంగల్ రంగశాయిపేట జంక్షన్ గవిచర్ల క్రాస్ రోడ్డు సమీపంలో ఓ వ్యక్తి ఓయో లాడ్జ్ పెట్టేందుకు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో గోవిందం దామోదర్, పరికిపండ్ల రాజేశ్వర్‌రావు, వీరన్న, ఉమ్మగాని గణేష్, పాక వెంకటేశ్వర్లు, నక్క కొమురెల్లి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతోనే లక్ష్య సాధన



కార్యక్రమంలో మాట్లాడుతున్న దామోదర్

మడికొండ: ఆత్మవిశ్వాసంతోనే లక్ష్య సాధన సాధ్యమని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు కంజాపురం దామోదర్ అన్నారు. మడికొండ శివారులోని సాంఘిక సంక్షేమ బాలికలు గురుకుల కళాశాలలో విద్యార్థులకు సంస్కార వికాస శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. అంబేడ్కర్, పూలే వంటి మహానుభావులను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్, వెంకటేశ్వర్లు, గంగారపు యాదగిరి, తాడూరి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



విద్యారణ్యపురి: జనగామ ప్రాంతానికి చెందిన ఆంజనేయులు, మణెమ్మ దంపతుల కుమారుడు అందించిన విరాళం ద్వారా హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లను హనుమకొండకు చెందిన రామకృష్ణ సోమవారం అందజేశారని హెచ్ఎం ఎం.ఉమ తెలిపారు. 240 మంది విద్యార్థినులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు వివరించారు.

బేడ బుడగ జంగాలకు చైర్మన్ పదవి ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వేణు

నయీంనగర్: ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటుచేసి అన్ని రంగాల్లో వెనుకబడిన ఎస్సీ ఏ కేటగిరిలో ఉన్న బేడ బుడగ జంగాలకు చైర్మన్ పదవి ఇవ్వాలని బేడ బుడగజంగం జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టో మేరకు ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, హైదరాబాద్‌లో వెయ్యి గజాల స్థలంలో కమిటీ నిర్మాణం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో, డబుల్ బెడ్రూం ఇళ్లల్లో 20 శాతం బేడ బుడగజంగాలకు కేటాయించాలని సూచించారు. సమావేశంలో సంఘం నాయకులు తూర్పాటి లింగయ్య, గిర్ని వెంకట్, చంద్రమౌళి, జంపయ్య, సారంగపాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై అవగాహన అవసరం

కేయూ క్యాంపస్: ఆధునిక కాలంలో వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులపై యువతకు అవగాహన అవసరం అని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్ అన్నారు. కళాశాలలో ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో వ్యవసాయంపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ రహమాన్, శ్రీధర్‌కుమార్, వీరస్వామి, వ్యవసాయ శాఖ అధికారి భవ్య పాల్గొన్నారు.

అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన



ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుడు శ్రీనివాస చార్యులు, ఆలయ నిర్మాత దాత గుండ్లపల్లి వెంకటేశ్వర్లు, సరస్వతి దంపతుల ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ నేతృత్వంలో విగ్రహ ప్రతిష్ఠాపన శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ కక్కె సారయ్య, భక్తులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తాచాటిన బాలికలు



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అంజిరెడ్డి



యువిజ్ఞను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

ఖిలా వరంగల్: హనుమకొండ జేఎన్ఎం స్టేడియంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి కరాటే పోటీల్లో ఉర్సుగుట్ట వరంగల్ మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొని సత్తాచాటారు. 22 మంది బాలికల హాజరై కటాస్‌లో విజేతగా నిలిచి ట్రోఫీ అందుకున్నారు. ఈమేరకు వారిని ప్రిన్సిపాల్ అంజిరెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు యువిజ్ఞ

కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్ మాన్‌ఫోర్ట్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న ఎడ్ల యువిజ్ఞ.. జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గోవు విన్సెంట్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు స్కూల్‌లో సోమవారం నిర్వహించిన అభినందన సభలో యువిజ్ఞను అభినందించారు. ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. యువిజ్ఞను ప్రిన్సిపాల్‌తో పాటు తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పి.సాంబశివరావు, హనుమకొండ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ తాబేటి రాజేందర్, కోశాధికారి వి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి, స్కూల్ పీఈటీ ఆంథోని అభినందించారు.

ఆత్మవిశ్వాసాన్ని నింపాలి



హసన్‌పర్తి: విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండలం ఎల్లాపురంలోని ఎస్వీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో వార్షికోత్సవాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజ్ఞానం నుంచి విముక్తిని కలిగించిన వారే నిజమైన గురువులుగా పేర్కొన్నారు. వందేమాతరం ఫౌండేషన్ అధ్యక్షుడు రవీందర్‌రావు మాట్లాడుతూ అమ్మ ఒడి.. మొదటి బడి అని తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్ గౌరిశెట్టి జగన్మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శేషగిరి, విద్యార్థులు పాల్గొన్నారు.

అపోలో ఎన్ఎస్ఆర్‌లో డయాలసిస్ సేవలు



డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్

వరంగల్: అపోలో హెల్త్ లైఫ్ స్టైల్ లిమిటెడ్‌కు అనుబంధంగా ఉన్న అపోలో డయాలసిస్ క్లినిక్స్ తన కొత్త డయాలసిస్ కేంద్రాన్ని ఆరెపల్లి సమీపంలోని అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ ఆస్పత్రిలో సోమవారం ప్రారంభించినట్లు ఎన్ఎస్ఆర్ గ్రూప్ చైర్మన్ ఎన్.సంపత్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపోలో ఎన్ఎస్ఆర్ ఆస్పత్రిలో రోగులు ఇకపై ఆరోగ్యశ్రీ, ఇతర ప్రధాన వైద్య బీమా పథకాల ద్వారా డయాలసిస్ సేవలు పొందవచ్చని అన్నారు. నెఫ్రాలజిస్ట్ నిర్మల్ పాపయ్య మాట్లాడుతూ మూత్రపిండ సంబంధిత వ్యాధులను సమయానికి గుర్తించి చికిత్స చేయడం ద్వారా రోగుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చవచ్చని చెప్పారు. డయాలసిస్ క్లినిక్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం.సుధాకర్‌రావు మాట్లాడుతూ అధునాతనమైన డయాలసిస్ క్లినిక్ ద్వారా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉన్నతమైన డయాలసిస్ సేవలను అందించనున్నట్లు వివరించారు.

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్సై మమత

కాజీపేట అర్బన్: గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, వాటితో జీవితం చిత్తవుతుందని కాజీపేట ఎక్సైజ్ ఎస్సై మమత అన్నారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని సూచించారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజగోపాల్, ఎక్సైజ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జంగా రాఘవరెడ్డి జన్మదిన వేడుకలు

మడికొండ: ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి జన్మదిన వేడుకలను మడికొండలో ఘనంగా నిర్వహించారు. రాఘవరెడ్డి అభిమాని పెనుకుల వినయ్ ఆధ్వర్యంలో మడికొండ చౌరస్తాలో కేక్ కట్‌చేసి, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, దర్గా సొసైటీ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, చిన్నకుమార్, విజయ్, బిల్ల రవీందర్, కుర్ల మోహన్, వస్కుల శంకర్, యాదవరెడ్డి, అర్జున్, రజిని వేణు, తదితరులు పాల్గొన్నారు.

'జంగా'ను కలిసిన రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి

హన్మకొండ అర్బన్: ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయనను క్యాంపు కార్యాలయంలో సోమవారం తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఆరోగ్యకరమైన జీవనంపై దృష్టి సారించాలి



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

- కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవనంపై దృష్టి సారించాలని, సానుకూల దృక్పథంతో ముందుకెళ్లాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి సూచించారు. విశ్వవిద్యాలయ మహిళా అధ్యాపకుల సంఘం, హనుమకొండ వాసవి ఆస్పత్రి సౌజన్యంతో క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఉమెన్ వెల్‌నెస్, అవేర్‌నెస్ ప్రోగ్రాం, అలాగే, వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం మాట్లాడుతూ మహిళలు మానసిక ఒత్తిడితో ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం లేదని అన్నారు. డాక్టర్ వాసవి మాట్లాడుతూ జీవనశైలిలో మార్పులతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రసాద్, డాక్టర్ పద్మజ, డాక్టర్ శ్రీలత, డాక్టర్ దీపాజ్యోతి, మహిళా అధ్యాపకులు, బోధనేతర ఉద్యోగులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సన్నద్ధం కావాలి

- ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న వెంకన్న

హన్మకొండ: సంస్థ ఆస్తులు, డిపోలను కాపాడుకునేందుకు ఆర్టీసీ కార్మికులు సన్నద్ధం కావాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న పిలుపునిచ్చారు. హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ -1 డిపో వద్ద సోమవారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎన్నో ఏళ్లుగా సంపాదించుకున్న ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలకు అప్పగిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులను రద్దు చేసి, సొంతంగా సంస్థయే ఆ బస్సులను కొనాలని సూచించారు. సమావేశంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

డ్రైవర్ చాకచక్యం.. తప్పిన ప్రమాదం



కాజీపేటలో బస్సు దిగిన ప్రయాణికులు

కాజీపేట: విధి నిర్వహణలో ఉన్న ఓ ఆర్టీసీ డ్రైవర్ అనారోగ్యానికి గురికావడంతో పెద్ద ప్రమాదం క్షణాల్లో తప్పిన సంఘటన సోమవారం రాత్రి కాజీపేట పట్టణంలో జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం జనగామ డిపోకు చెందిన బస్సు హనుమకొండ నుంచి కాజీపేట మీదుగా జనగామకు వెళ్తుండగా బాపూజీనగర్ కూరగాయల మార్కెట్ సమీపంలోకి రాగానే ఆర్టీసీ డ్రైవర్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దాంతో బస్సును అతి కష్టం మీద అదుపు చేసి పక్కకు ఆపారు. ఒకసారిగా భారీ కుదుపుతో బస్సు ఆగడంతో భయాందోళనలకు గురైన ప్రయాణికులు ఏమి జరిగిందో అర్థం గాక డ్రైవర్ మద్యం తాగి ఉంటాడని భావించి దాడికి యత్నించడంతో కండక్టర్ అడ్డుకున్నారు. ప్రయాణికులు 100 డయల్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో సీఐ సుధాకర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌కు డ్రంకెన్ డ్రైవ్ చేపట్టగా అలాంటి ఏమీ లేదని బస్సు నడిపించే సమయంలో అనారోగ్యానికి గురికావడమే కారణమని వెల్లడయ్యింది. డ్రైవర్‌ను పోలీసులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

వికసిత్ భారత్.. కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

విద్యారణ్యపురి: వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్లోందని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎకనామిక్స్ విభాగం అధ్యాపకుడు డాక్టర్ తిరుణహరి శేషు అన్నారు. హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ కళాశాలలో ఆర్థికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై సోమవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులకు ఫైనాన్సియల్ లిటరసీ అవసరం అన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ పద్మ, అధ్యాపకులు శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, సామిల్ ప్రవీణ్‌కుమార్, సారంగపాణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

వరంగల్: ఏనుమాముల మార్కెట్ సమీపంలో పోలీసులు సోమవారం ఉదయం తనిఖీలు చేస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తి వద్ద 230గ్రాముల గంజాయి లభ్యమైందని పోలీసు ఇన్‌స్పెక్టర్ ఏ.రాఘవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అదుపులో తీసుకుని విచారించగా మొహమ్మద్ ఫిరోజ్.. దేశాయిపేటలో చికెన్ సెంటర్ నిర్వహిస్తూ గంజాయి తాగుడుకు అలవాటు పడి సీలేరు నుంచి గంజాయి కొనుక్కొని వచ్చి ఏనుమాముల పరిసర ప్రాంతాల్లో అమ్ముతున్నట్లు తేలిందన్నారు. ఈమేరకు అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు రాఘవేందర్ వివరించారు.